ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
బుధవారం 21 ఫిబ్రవరి 2024





వేణుగోపాలస్వామికి పూజలు..

శాలిహుండం.. భక్తజన సంద్రం

- వైభవంగా వేణుగోపాలస్వామి యాత్ర
- వంశధార నదిలో ఉత్సవమూర్తులకు చక్రస్నానం

గార, ఫిబ్రవరి 20


భీష్మ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని.. గార మండలం శాలిహుండం (శ్వేతగిరి) భక్తజన సంద్రమైంది. ఈ కొండపై వెలసిన కాళీయమర్దన వేణుగోపాలస్వామి యాత్ర వైభవంగా సాగింది. మంగళవారం నిర్వహించిన ఈ యాత్రకు జిల్లాతోపాటు విజయనగరం, విశాఖపట్నం, ఒడిశా ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలి వచ్చారు. రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా అర్చకులు సోమవారం అర్ధరాత్రి 12.30 గంటలకు స్వామి మూలవిరాట్‌కు క్షీరాభిషేకం చేశారు. ట్రస్టుబోర్డు చైర్మన్ సుగ్గు మధురెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. మంగళవారం ఉదయం మేళతాళాలతో ఉత్సవ మూర్తులను పల్లకిలో ఊరేగింపుగా వంశధార నదీ తీరానికి తీసుకెళ్లి చక్రస్నానం చేయించారు. భక్తులు వంశధార నదిలో పవిత్ర స్నానాలు ఆచరించి.. కొండమీదకు చేరుకుని స్వామిని దర్శించు కున్నారు. మెట్లమార్గంలో నడుచుకుంటూ.. మార్గమధ్యలో వీర వసంతీశ్వర స్వామి, అయ్యప్ప స్వామి, అభయ ఆంజనేయస్వామి, కొండ దిగువన నరసింహస్వామి, వేంకటేశ్వరస్వామి, వరదరాజు స్వామి సన్నిధిల్లో కూడా పూజలు చేశారు. కొండపైన, క్యూలైన్లలో ఎక్కడ చూసినా భక్తుల రద్దీ కనిపించింది. భక్తులకు ఇబ్బందులు లేకుండా సీఐ ఎల్.ఎస్.నాయుడు, గార ఎస్ఐ కే.కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో 150 మంది పోలీసులు బందోబస్తు చేపట్టారు. బోరవానిపేట, బూరవెల్లి సత్యసాయి భజన మండలి సభ్యులు భక్తులకు తాగునీరు, మజ్జిగ, అన్న ప్రసాద వితరణ చేశారు. పూసర్లపాడు వద్ద స్థానికులు కూడా అన్నదానం చేశారు. బూరవెల్లిలో గ్రామస్థులు తాగునీరు, మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో బోరవానిపేట సత్యసాయి భజన మండలి కో-కన్వీనర్ బోర సింహాచలం, తదితర సభ్యులు పాల్గొన్నారు.



శాలిహుండం కొండపైకి నడుచుకుంటూ వెళ్తున్న భక్తులు



వేణుగోపాలస్వామి ఆలయం వద్ద క్యూలో భక్తుల కిటకిట



వంశధార నదిలో ఉత్సవమూర్తులకు చక్రతీర్థస్నానం.. పాల్గొన్న భక్తులు



ఆలయంలో పూజలు చేస్తున్న అచ్చెన్నాయుడు దంపతులు

చెట్లతాండ్రలో అరటి గెలల ఉత్సవం

సంతబొమ్మాళి: చెట్లతాండ్రలోని లక్ష్మీనరసింహ ఆలయంలో మంగళవారం అరటిగెలల ఉత్సవం ఘనంగా నిర్వహించారు. భీష్మ ఏకాదశి సందర్భంగా మంగళవారం వేకువజాము నుంచే ఆలయం వద్ద భక్తులు బారులు దీరారు. ఈ ఆలయంలో అరటిగెలలు కడితే కోర్కెలు తీరుతాయని భక్తుల నమ్మకం. ఈ నేపథ్యంలో సుమారు 5వేలకు పైగా అరటిగెలలను భక్తులు సమర్పించారు. అరటిగెలలు కట్టేందుకు ఆలయ కమిటీ సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అన్నదానం చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అలాగే లక్ష్మీనరసింహస్వామిని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు సతీసమేతంగా దర్శించుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెలమల విజయలక్ష్మి, మెండ దాసునాయుడు, పంగ అశిరినాయుడు, రెడ్డి అప్పన్న పాల్గొన్నారు.



చెట్లతాండ్రలో భక్తులు కట్టిన అరటిగెలలు

పత్రికా స్వేచ్ఛను హరించొద్దు

- 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్‌పై దాడికి నిరసనగా పాత్రికేయుల ధర్నా
- జర్నలిస్టులూ ఓటర్లేనన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని నినాదాలు

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

అనంతపురం జిల్లా రాప్తాడులో 'ఆంధ్రజ్యోతి' ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకల దాడిని జర్నలిస్టు సంఘాలు తీవ్రంగా ఖండించాయి. శ్రీకాకుళంలో ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో మంగళవారం భారీఎత్తున జర్నలిస్టులు ఆందోళన చేపట్టారు. 'పత్రికాస్వేచ్ఛను హరించొద్దు' అంటూ నినాదాలు చేశారు. 'జర్నలిస్టులకూ కుటుంబాలుంటాయి.. వాళ్లూ ఓటర్లే అన్న విషయాన్ని ప్రభుత్వం గుర్తించుకోవాల'ంటూ నినదించారు. దాడికి పాల్పడిన వారిని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు దాడులకు పాల్పడుతున్న అధికారపార్టీ తీరును ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. ఇండియన్ జర్నలిస్టు యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు నల్లి ధర్మారావు మాట్లాడుతూ జర్నలిస్టులపై దాడులకు పాల్పడుతూ పత్రికా స్వేచ్ఛను హరించాలని ప్రభుత్వం చూస్తోందని ఆరోపించారు. 'ఎందరో మహామహులు.. నియంతలు సైతం గద్దెనెక్కి దిగిపోయిన ఘటనలు గుర్తుతెచ్చుకోవాలి. యాజమాన్యాలను దృష్టిలో ఉంచుకుని సిబ్బందిపై దాడులు సరికాదు. జర్నలిస్టులు సమాజానికి దిక్సూచిగా ఉన్నంతవరకు అధికార పార్టీ బెదిరింపులు ఏమీచేయలేవు' అని ధర్మారావు స్పష్టం చేశారు. అనంతరం జర్నలిస్టులంతా ప్రెస్‌క్లబ్ నుంచి గాంధీ పార్కు వద్దకు ప్లకార్డులతో ర్యాలీ చేశారు. గాంధీ విగ్రహానికి వినతిపత్రాన్ని సమర్పించారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈశ్వరరావు, సామ్నా రాష్ట్రకార్యవర్గ సభ్యులు మల్లేశ్వరరావు, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు చైతన్య, సత్యనారాయణ, సీనియర్ జర్నలిస్టు నాగభూషణం, ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామారావు, జిల్లా ప్రతినిధి నాయుడు, ఆంధ్రజ్యోతి, ఏబీఎన్, టీవీ5, ఎన్టీవీ జిల్లా ప్రతినిధులు పాల్గొన్నారు.



శ్రీకాకుళంలో జర్నలిస్టుల నిరసన



శ్రీకాకుళంలో ధర్నా చేస్తున్న ఉద్యోగులు, ఉపాధ్యాయ సంఘాలు

సమస్యలను పరిష్కరించకపోతే ఉపేక్షించం

- ఎన్జీవో రాష్ట్ర సహాధ్యక్షుడు చౌదరి పురుషోత్తం నాయుడు

కలెక్టరేట్, ఫిబ్రవరి 20: ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించకపోతే ఉపేక్షించేది లేదని ఎన్జీవో రాష్ట్ర సహాధ్యక్షుడు చౌదరి పురుషోత్తం నాయుడు స్పష్టం చేశారు. జేఏసీ పిలుపు మేరకు మంగళవారం శ్రీకాకుళంలోని కలెక్టరేట్ సమీపంలో జ్యోతిబా పూలే పార్కు వద్ద నిరసన శిబిరం ఏర్పాటు చేసి ధర్నా చేశారు. పురుషోత్తం నాయుడు మాట్లాడుతూ.. 'ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేరుస్తుందని, సమస్యలు పరిష్కరిస్తుందని ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు నాలుగునరేళ్లుగా ఎదురుచూసి విసిగిపోయారు. రాష్ట్ర ప్రభుత్వ తీరుపై తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారు. పెండింగ్‌లో ఉన్న 11వ పీఆర్సీ బకాయిలు రూ.23,500 కోట్లు వెంటనే చెల్లించాలి. గత జూలై నాటికే 12వ పీఆర్సీ సమయం పూర్తయింది. ఇప్పటికే ఆలస్యమైన కారణంగా 30శాతం మధ్యంతర భృతి చెల్లించాలి. కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాల'ని డిమాండ్ చేశారు. జేఏసీ జిల్లా చైర్మన్ హనుమంతు సాయిరాం మాట్లాడుతూ.. శ్రీకాకుళంలో 104 సంఘాల పక్షాన జేఏసీ ఉద్యమంలో ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు పాల్గొంటున్నారని తెలిపారు. నూతన పీఆర్సీని అమలు చేయాలని, ధరలకు అనుగుణంగా ఐఆర్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే ఈ నెల 27 చలో విజయవాడ కార్యక్రమాన్ని పెద్దఎత్తున నిర్వహిస్తామని తెలిపారు. ఉద్యోగుల వ్యతిరేకతను తేలికగా తీసుకోవద్దని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సంపతిరావు కిషోర్‌కుమార్, ఏపీటీఎఫ్ రాష్ట్ర నాయకుడు కె.భానుమూర్తి, ప్రధాన కార్యదర్శి టెంక చలపతి రావు, ఎఫ్‌టీయూ ప్రధాన కార్యదర్శి ఎస్.వి.రమణ, డీటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.కృష్ణారావు, అనిల్‌కుమార్, బీపీఏ ప్రతాప్‌కుమార్, పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు డి.పార్వతీశం, బొడ్డేపల్లి మోహనరావు, ఆర్.నారాయణమూర్తి, బి.శ్రీరామ్మూర్తి, జి.గిరిధర్ పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌తో సత్వర న్యాయం

- జిల్లా న్యాయాధికారి జేఏ మౌలానా



మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి జేఏ మౌలానా

గుజరాతీపేట, ఫిబ్రవరి 20: మోటారు వాహన ప్రమాద బాధితులకు జాతీయ లోక్ అదాలత్ ద్వారా సత్వర న్యాయం లభిస్తుందని జిల్లా న్యాయాధికారి జేఏ మౌలానా తెలిపారు. మంగళవారం శ్రీకాకుళంలో అధికారులు, స్టాండింగ్ కౌన్సిల్ సభ్యులతో ఆయన సమావేశమయ్యారు. వచ్చే నెల 9న నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్‌లో మోటారు ప్రమాద కేసులు ఎక్కువ సంఖ్యలో రాజీ అయ్యేలా చూడాలని సూచించారు. మోటారు ప్రమాదాల్లో ఇంటి పెద్ద మృతి చెందితే.. ఆ కుటుంబం పరిస్థితి దారుణంగా ఉంటుందన్నారు. త్వరగా పరిహారం అందిస్తే.. బాధిత కుటుంబాలు నిలదొక్కుకునే అవకాశం ఉందన్నారు. సమావేశంలో శాశ్వత లోక్ అదాలత్ చైర్మన్ జి.సువర్ణరాజు, సీనియర్ సివిల్ న్యాయాధికారి ఆర్.సన్యాసినాయుడు, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్ని సూర్యారావు, ఇన్సూరెన్స్ కంపెనీ తరఫున స్టాండింగ్ కౌన్సిల్ మంచు జనార్దన్, ఎస్.రాజేశ్వరరావు, జీవరత్నం, సింహాచలం, టి.ఖగేంద్రనాథ్, ఇన్సూరెన్స్ కంపెనీ అధికారులు, స్టాండింగ్ కౌన్సిల్ మోటారు వాహన ప్రమాద కేసుల్లో పిటిషనర్ తరఫున న్యాయవాదులు పాల్గొన్నారు.

135 కిలోల వెండి ఆభరణాల స్వాధీనం

- ఆర్పీఎఫ్ అదుపులో తమిళనాడు వాసులు

ఆమదాలవలస, ఫిబ్రవరి 20: శ్రీకాకుళం రోడ్డు (ఆమదాలవలస) రైల్వేస్టేషనులో మంగళవారం మధ్యాహ్నం భారీగా వెండి ఆభరణాలతో ఉన్న ముగ్గురు వ్యక్తులను ఆర్పీఎఫ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. తమిళనాడు రాష్ట్రం సేలంకు చెందిన ఆర్.నిత్యానందం ప్రకాష్, రామస్వామి, సతీష్‌కుమార్ (బాలసుబ్రహ్మణ్యం).. భువనేశ్వర్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లో బెంగళూరు నుంచి భువనేశ్వర్ వెళ్తున్నారు. వారు ఎటువంటి రికార్డులు లేకుండా 135 కేజీల వెండి ఆభరణాలు తరలిస్తున్నట్టు రైల్వే పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు ఆమదాలవలసలో రైల్వే పోలీసులు ఆ ముగ్గురిని అదుపులోకి తీసుకుని.. వారి నుంచి వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకుని జీఎస్టీ అధికారులకు అప్పగించారు. ఈ విషయమై ఆర్పీఎఫ్ అధికారుల వద్ద విలేకరులు ప్రస్తావించగా.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి విచారణ చేపడతామన్నారు. దర్యాప్తు అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని తెలిపారు.

నారాయణపురం కొండ ఆక్రమణ

- సుమారు 50 ఎకరాలు కబ్జా
- చోద్యం చూస్తున్న అటవీశాఖ

(వజ్రపుకొత్తూరు)

వజ్రపుకొత్తూరు మండలం పెద్దబొడ్డపాడు పంచాయతీలోని నారాయణపురం కొండ ఆక్రమణకు గురవుతోంది. సర్వేనెంబరు 242 నుంచి 252 పరిధిలో సుమారు 250 ఎకరాల విస్తీర్ణంలో ఈ కొండ విస్తరించి ఉంది. అటవీశాఖ ఆధ్వర్యంలో ఉన్న ఈ కొండ భూములపై అక్రమార్కుల కన్ను పడింది. 50 ఎకరాల మేర ఆక్రమణకు గురైంది. అటవీశాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఆక్రమణదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. మండలంలోని బెండి, అనంతగిరి కొండలు ఇప్పటికే ఆక్రమణకు గురి కాగా.. నారాయణపురం కొండ కూడా కబ్జా చేస్తుండడంపై ఆందోళన చెందుతున్నారు. ఇక్కడ ఎకరా విలువ రూ.10లక్షలకుపైగా ఉందని పేర్కొంటున్నారు. ఆక్రమణదారులు ముందుగా కంచె వేసి.. ఆపై తోటల పెంపకానికి సిద్ధమవుతూ కబ్జా చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. కొండ ఆక్రమణకు గురవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఈ భూములు తమ ఆధీనంలో లేవని రెవెన్యూ అధికారులు చెబుతుండగా.. అటవీశాఖ అధికారులకు ఉన్నతాధికారులకు నివేదిస్తామంటూ కాలయాపన చేస్తున్నారని పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆక్రమణలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు. ఈ విషయమై అటవీశాఖ అధికారి భాస్కర్‌రెడ్డి వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా.. ఆక్రమణలపై ఫిర్యాదులు అందాయని తెలిపారు. పరిశీలించి.. ఆక్రమణలు తొలగిస్తామన్నారు.



ఆక్రమణకు గురైన నారాయణపురం కొండ

తొలగించాలి..

నారాయణపురం కొండ ఆక్రమణ విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదు. ఆక్రమణలపై మండల సర్వసభ్య సమావేశంలో ప్రస్తావించాను. అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదులు చేశా. ఆక్రమించిన వారిలో ధనికులే ఉన్నారు. ఆక్రమణలు తొలగించి పంచాయతీలో పేదలకు భూమిని పంచిపెట్టాలని అధికారులను కోరాను. ఉన్నతాధికారుల దృష్టికి ఈ విషయం తీసుకెళ్తామని అటవీశాఖ అధికారులు చెప్పారు.

-తమ్మినేని ఢిల్లీరావు, సర్పంచ్, పెద్దబొడ్డపాడు



మండల సమావేశంలో నారాయణపురం కొండల ఆక్రమణపై ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్ తమ్మినేని ఢిల్లీరావు

అటు సన్మానాలు.. ఇటు నోటీసులు

- ఆందోళనలో వలంటీర్లు



నోటీసులు ఇలా..

మెళియాపుట్టి, ఫిబ్రవరి 20: పాతపట్నం మేజర్ పంచాయతీలోని రెండో సచివాలయం పరిధిలో 38మంది వలంటీర్లు ఉండగా.. అధికారులు 28మందికి నోటీసులు అందజేశారు. సచివాలయం-3 లో 32మంది వలంటీర్లు ఉండగా.. 25మందికి మంగళవారం ఎంపీడీవో నోటీసులు జారీచేశారు. దీంతో వలంటీర్లు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం వలంటీర్లకు సేవావజ్ర, సేవారత్న బిరుదులతో నగదు పారితోషికంతో సన్మానాలు చేస్తోంది. మరోవైపు సక్రమంగా పనిచేయడం లేదంటూ నోటీసులు అందజేస్తోందని వలంటీర్లు వాపోతున్నారు. ప్రజలకు ఆరోగ్యశ్రీ కార్డులు సక్రమంగా అందజేయని వలంటీర్లకు నోటీసులు ఇస్తున్నట్టు అధికారులు చెబుతున్నారు. కొన్నిగ్రామాల్లో నెట్‌వర్క్ సమస్య ఎదురవుతోందని వలంటీర్లు పేర్కొంటున్నారు. ప్రభుత్వం నుంచి కొంతమందికి కార్డులు జారీకావడం లేదని, ఆ తప్పు వలంటీర్లు, ఆరోగ్యసిబ్బందిపై పెట్టడం ఎంతవరకు న్యాయమనే ప్రశ్నిస్తున్నారు. జిల్లాలో ఎక్కడా లేని విధంగా పాతపట్నంలోనే నోటీసులు జారీ చేస్తుండడంతో ఎమ్మెల్యే రెడ్డిశాంతి తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



జాతరకు పోటెత్తిన భక్తులు

రణస్థలం మండలం కమ్మసిగడాం జాతరకు భక్తులు పోటెత్తారు. మూడోరోజు మంగళవారం మహాలక్ష్మీతల్లి అమ్మవారిని దర్శించుకునేందుకు భారీగా తరలివచ్చారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

- రణస్థలం


పలాస: ఉల్లాసపేటలో స్వామిని దర్శించుకుంటున్న భక్తులు


నరసన్నపేట: గోపాలపెంట రామలమ్మ పేరంటాలుకు మొక్కు చెల్లించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే బగ్గు


సరుబుజ్జిలి: బురిడివలసకాలనీ శ్రీరామందిరంలో శ్రీరామ పాదుకులకు పూజలు చేస్తున్న భక్తులు


మందస: వాసుదేవుని ఆలయంలో ధ్వజ స్తంభం వద్ద పూజలు

ఘనంగా భీష్మ ఏకాదశి

● గ్రామాల్లో వెల్లివిరిసిన ఆధ్యాత్మికత ● జాతరలతో సందడే సందడి


హిరమండలంలో..

భీష్మ ఏకాదశి పర్వదినం సందర్భంగా వైష్ణవాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. గ్రామాల్లో మంగళవారం తెల్లవారుజాము నుంచే భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించి దేవాలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయాల్లో విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఓం నమో నారాయణాయ, గోవిందా గోవింద నామస్మరణలతో ఆలయాలు మారుమ్రోగాయి. శ్రీముఖలింగంలోని ముఖలింగేశ్వర స్వామికి గ్రామోత్సవం నిర్వహించారు. అలాగే వివిధ గ్రామాల్లో జాతరలు నిర్వహించారు. వేలాది మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే వివిధ సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వాహకులు ఏర్పాటు చేశారు.

-ఆంధ్రజ్యోతి బృందం


శ్రీకాకుళం కల్చరల్: శివ బాలాజీ ఆలయంలో..


జి.సిగడాం: నిద్దాంలో దీపోత్సవం


ఇచ్ఛాపురం: జగన్నాథాలయంలో పూజలు చేస్తున్న మహిళలు


పాతపట్నం: వేంకటేశ్వర ఆలయంలో దీపారాధన


టెక్కలి: పాండవుల మెట్టపై విష్ణుసహస్ర నామ పారాయణ చేస్తున్న మహిళలు


ఎచ్చెర్ల: అల్లినగరం శ్రీరామ మందిరంలో భజనలు చేస్తున్న దృశ్యం

జీవోలు మార్ఫింగ్ చేసిన వారిపై చర్యలు తీసుకోండి


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న నేతలు

వజ్రపుకొత్తూరు: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవోలను మార్ఫింగ్ చేసి వైసీపీ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం తెలుగుయువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు బుల్లోజు శశిభూషణ్ ఆధ్వర్యంలో టీడీపీ మండల అధ్యక్షుడు సూరాడ మోహనరావు, ఉపాధ్యక్షుడు అర్జవెల్లి ఉమామహేశ్వరరావు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడుతూ.. నువ్వలరేవు ఉప్పుటేరుపై వంతెన నిర్మాణా నికి అప్పటి ఎమ్మెల్యే గౌతుశివాజీ ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి 2015లో రూ.40 కోట్లు మంజూరు చేయిం చగా 2016లో టెండర్ ప్రక్రియ చేపట్టి పనులు ప్రారంభించారన్నారు. అయితే ఈ జీవోలు 2013లో విడుదలైనట్లు మార్ఫింగ్ చేసి వైసీపీ సోషల్ మీడియాల్లో టీడీపీ నాయకులపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. దీనికి సంబంధించిన అన్ని సాక్ష్యాధారాలను పోలీసులకు అందిం చామని, తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అంబటి రామకృష్ణ, మరడ దుర్యోధన రెడ్డి, ఆకుల పాపారావు, కోనారి కిరణ్‌కుమార్, పోతనపల్లి షణ్ముఖరావు, సింగుపల్లి బాలకృష్ణ, రెల్ల దానయ్య తదితరులున్నారు.

నిబంధనలకు వ్యతిరేకంగా ఉపాధి పనులు

వజ్రపుకొత్తూరు: మండలంలో ఉపాధి హామీ పనులు నిబంధనలకు వ్యతిరేకంగా జరుగుతున్నాయని తీరప్రాంత టీడీపీ నాయకులు అన్నారు. మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ.. వైసీపీ నాయకులు చెప్పినట్లు అధికారులు పనులు చేపడుతున్నారని, వాటికి కనీసం ఎలాంటి రికార్డులు, తీర్మానాలు ఉండడం లేదన్నారు. పూర్తిస్థాయిలో యంత్రాలతో పనులు చేస్తుండడంతో వేతన దారులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఆందోళన చేపడతామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు సూరాడ మోహనరావు, ఆకుల పాపారావు, శాంతారావు, అంబటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కనీస అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలి

నరసన్నపేట: విద్యార్థుల్లో కనీస అభ్యస సామర్థ్యాలను పెంపొందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం (లిప్) రాష్ట్ర స్థాయి బృంద సభ్యుడు, విజయనగరం డైట్ ప్రిన్సిపాల్ ఎన్టీ నాయుడు అన్నారు. మంగళవారం వీఎన్‌పురం, ఉర్లాం ఉన్నత పాఠశాలల్లో లిప్‌పై ఉపాధ్యాయులకు ఉన్న అవగాహన, బోధనా-సాధన పీరియడ్ అమలు, ఉపాధ్యాయుల నైపుణ్యాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 పి.దాలినాయుడు, హెచ్‌ఎం హర్షవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

ఆంగ్లభాష బోధనపై రాష్ట్రబృందం పరిశీలన

ఈదులవలస(పోలాకి): ఈదులవలస మోడల్ స్కూల్‌లో విద్యార్థులకు ఆంగ్లభాషా బోధనపై మంగళవారం ల్యాంగ్వేజ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం (లిప్) రాష్ట్రపరిశీలకులు పరిశీలించారు. ఎ.ప్రవీణ్‌కుమార్, ఎం.రమేష్ చంద్ర, జి.రవి విద్యార్థుల అభ్యసన స్థాయిని పరీక్షించారు. విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాన్ని పెంపొందించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పైడి ప్రవీణ, ఏఎంవో గుంట లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

108 అంబులెన్స్ సిబ్బందికి శిక్షణ

పలాస: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో 108 అంబులెన్స్ ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్లకు మంగళవారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈఎంటీలకు యునైటెడ్ కింగ్‌డమ్ మాడ్యూల్ అనుగుణంగా శిక్షణ ఇచ్చారు. జిల్లా ఈఎంఎస్ మేనేజర్ హరిప్రసాద్, జగన్నాథరావు పర్యవేక్షణలో అత్యవసర సమ యాల్లో సిబ్బంది ఏ విధంగా స్పందించాలో వివరించారు. కార్యక్రమంలో టెక్కలి, పలాస రెవెన్యూ డివిజన్ల పరిధిలోని 108 సిబ్బంది పాల్గొన్నారు.

మాతృభాషలను పరిరక్షించుకోవాలి

మందస: మాతృభాషలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని గిడుగు రామ మూర్తి తెలుగుభాష, జానపద కళాపీఠం వ్యవస్థాపకుడు బద్రి కూర్మారావు అన్నారు. మందస పెన్షనర్ల సంఘ భవనంలో మంగళవారం అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం నిర్వహించారు. ఆంగ్లభాషపై మక్కువతో మాతృ భాషపై వివక్ష చూపుతున్నామని, ఇది తగదన్నారు. ఈ ప్రాంతాల్లో ఒడియా, తెలుగుతో పాటు సవర భాషలున్నాయని, వాటి పరిరక్షణకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సవర రామారావు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు వడ్డి గోపాలకృష్ణ, ఆర్.దిలీప్‌కుమార్, సోములయ్య, యాదగిరి, సాలిన జోగారావు, సన్యాసిరావు, నల్ల పార్వతీశం పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహ స్వామి కల్యాణం

నందిగాం: నందిగాం మధుర సుబ్బమ్మపేటలో వేంచేసియున్న లక్ష్మీ నరసింహస్వామి వార్షిక కల్యాణం మంగళవారం రాత్రి వైభవంగా జరిగింది. ధర్మకర్త కేకే రంగనాథాచార్యులు ఆధ్వర్యంలో బాలసీమకు చెందిన వేద పండితుడు చామర్తి శ్రీనివాసా చార్యులు, ఆలయ అర్చకులు కె.రామానుజా చార్యులు పర్యవేక్షణలో ఈ కార్యక్రమం నిర్వహించారు.


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

ముగిసిన విగ్రహాల ప్రతిష్ఠోత్సవాలు


పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: కాశీబుగ్గ రాధాకాంతస్వామి ఆలయంలో ఈనెల 18 నుంచి ప్రారంభమైన విగ్రహాల ప్రతిష్ఠ కార్యక్రమాలు మంగళవారంతో ముగిశాయి. పురా తన ఆలయానికి చెందిన విగ్రహాల స్థానంలో దశావతార, జయవిజయ, ఆంజ నేయ, గరుత్మంతుల నూతన విగ్రహాలకు శాస్త్రోక్తంగా పూజలు చేసిప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా వివిధ కార్యక్రమాలు చేపట్టారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

పునః ప్రతిష్ఠోత్సవాలు ప్రారంభం

నందిగాం: దిమ్మిడిజోలలో నూతనంగా నిర్మించిన రామమందిర పునఃప్రతిష్ఠోత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. విగ్రహాలను మేళతాళాల మధ్య ఊరేగించారు. ఈ సందర్భంగా పూండీకి చెందిన వేదపండితులు టి.ప్రసాద్‌శర్మ, గ్రామపురోహితులు మదన్‌మోహన్ మిశ్ర పర్య వేక్షణలో విశేష పూజలు చేశారు. మహిళలు కలశాలు పట్టుకుని ఊరేగింపులో పాల్గొన్నారు.

హాకీలో ప్రతిభ కనబరచాలి

కాశీబుగ్గ: హాకీ క్రీడలో ప్రతిభ కనబరిచి పేరు తీసుకురావాలని ప్రముఖ వైద్యుడు ఎం.మల్లేశ్వరరావు ఆకాంక్షించారు. మంగళవారం కాశీబుగ్గ జడ్పీ ఉన్నత పాఠశాల హాకీ క్రీడాకారులకు ప్రజ్ఞ హెల్పింగ్ హెండ్స్ సంస్థ ద్వారా రూ.60 వేలు విలువచేసే హాకీ క్రీడా సామాగ్రిని అందజేశారు. ఈ సందర్భంగా క్రీడా పోటీల్లో జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరచాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ వెంకటరమణ, పీఈటీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


క్రీడా సామగ్రి పంపిణీ చేస్తున్న దృశ్యం

ఫొటోగ్రాఫర్‌పై దాడి అమానుషం

పోలాకి: రాప్తాడు వైసీపీ సభలో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకల దాడి అమానుషమని పోలాకి జర్నలిస్టుల సంఘం నిరసన వ్యక్తం చేసింది. మంగళవారం మండల రెవెన్యూ కార్యాలయం వద్ద నిరసన చేపట్టి దాడిని ఖండించారు. పాత్రికేయ వృత్తిలో ఫొటోగ్రాఫర్‌పై వైసీపీ మూకలు దాడిచేయడం మంచి పద్ధతి కాదని మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, మాజీ సర్పంచ్ రాంబాబు, పార్టీ మండల అధ్యక్షుడు మిరియబ్బిల్లి వెంకట అప్పలనాయుడు తదితరులు అన్నారు. దాడిని ఖండించిన వారిలో యందవ హరికృష్ణ బైరి బాస్కరరావు, పల్లి సూరిబాబు, తర్ర లక్ష్మీనారాయణ తదితరులున్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

నరసన్నపేట: జమ్ము, తామరాపల్లి గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ కనకారావు మంగళవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో పూర్తి స్థాయిలో మౌలిక సదుపాయాలు ఉండాలన్నారు. దివ్యాంగుల కోసం ర్యాంపులను ఏర్పాటు చేయాలన్నారు.

మోసపూరిత హామీలతో కాలం వెల్లబుచ్చాడు

- వైసీపీకి చరమగీతం పాడుదాం
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు
- వైసీపీ నుంచి టీడీపీలోకి భారీ చేరికలు

టెక్కలి, ఫిబ్రవరి 20: ఐదేళ్లుగా ఎటువంటి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టకుండా సీఎం జగన్ కాలం వెల్లబుచ్చాడని, రానున్న ఎన్నికల్లో వైసీపీకి చరమగీతం పాడాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. మంగళవారం కోటబొమ్మాళి మండలం హరిశ్చంద్రపురం పంచాయతీబావన్నపేట, ఉప్పరపేట, చిన్న హరిశ్చంద్రపురం గ్రామాల్లో పర్యటిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కాడని విమర్శించారు. టీడీపీ హయాంలో అమలు చేసిన పథకాల పేర్లు మారుస్తూ కొన సాగించారని, తాము అధికారంలోకి వచ్చిన తరువాత రెట్టింపు సంక్షేమ పథకాలను అందిస్తామని హామీ ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ కార్యకర్తలు, నేతలు సైనికుల్లా పనిచేసి పార్టీ విజయానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవింద రాజులు, జనసేన నాయ కులు కణితి కిరణ్ కుమార్, పల్లి కోటేశ్వర రావు, టీడీపీ నాయకులు బోయిన రమేష్, వెలమల కామేశ్వరరావు, విజయలక్ష్మి, తర్ర రామకృష్ణ, గొండు లక్ష్మణ రావు, పూజారి శైలజ, రమణమ్మ, వాన లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి భారీ చేరికలు

టెక్కలి, కోటబొమ్మాళి మండలాల నుంచి పలువురు వైసీపీ నేతలు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. కోటబొమ్మాళి పార్టీ కార్యాలయంలో వీరికి టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. వైసీపీలో చేరిన వారిలో కోటబొమ్మాళికి చెందిన తాలాసు కృష్ణ, తలాసు రాజేష్, పొట్నూరు నరసింహమూర్తి, రమణమూర్తి, సకలాభక్తుల భీమారావు, వెంకటరావు, సంతోష్, సునీల్, హరి, కిరణ్, పొట్నూరి మణిదీప్, నందాన గోవింద్, అందవరపు కృష్ణారావు, బోయిన ఈశ్వరరావు తదితరులున్నారు. టెక్కలి మండలం బన్నువాడ పంచాయతీ నుంచి వైసీపీ వార్డు సభ్యుడు కొల్లి ధర్మారావు, నంబాళ నారాయణ, రమణ, కొల్లి దుర్యోధన రావుతో పాటు 20 కుటుం బాలు, టెక్కలి ఆది ఆంధ్ర వీధి నుంచి గొల్ల వలస డిల్లేశ్వరరావు, చింతల బాషా, ఉర్జాన ఏసు, కిర్రి మణి, దేవాది తరుణ్, గోపాల్, పవన్, రోహిత్, మల్లేసులతో పాటు 70 కుటుంబాలు, వంశధార కాలనీ నుంచి గూన సింహాచలం, శివ సాగర్, పవన్‌కుమార్, సాయి, బాలరాజులతో పాటు మరి కొందరు టీడీపీలో చేరారు. హరిశ్చంద్రపురం ఉప సర్పంచ్ మెగిలి రామారావు అచ్చెన్నాయుడు సమక్షంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.


వైసీపీ నుంచి టీడీపీలో చేరిన వారితో అచ్చెన్నాయుడు

సాగునీరు వృథా చేయొద్దని రైతుల ఆందోళన



హిరమండలం: గొట్టా బ్యారేజి ఎగువ ప్రాంతంలో నిల్వ ఉన్న సాగు నీటిని వృథా చేయొద్దని ఆయకట్టు రైతులు మంగళవారం రాత్రి బ్యారేజి వద్ద ఆందోళనకు దిగారు. ఈ సమయంలో కంట్రోల్ రూమ్ వద్ద సిబ్బంది ఎవరూ లేకపోవడంతో జడ్పీటీసీ బుచ్చిబాబుకు సమాచారం ఇచ్చారు. దీంతో ఆయన అక్కడికి చేరుకుని రైతుల సమస్యను తెలుసుకున్నారు. గొట్టా బ్యారేజీ ఎడమ కాలువ ద్వారా కొన్ని రోజులుగా 150 క్యూసెక్కుల వరకు సాగు నీటిని విడిచి పెడుతున్నారు. దీంతో దిగువ ప్రాంతాల్లోని రైతులు సుమారు 40 వేల ఎకరాల్లో వరి, మొక్క జొన్న తదితర పంటలు వేసుకున్నారు. శాలిహుండం యాత్ర నేపథ్యంలో మంగళవారం ఉదయం బ్యారేజి ఒక గేటు పైకెత్తి సుమారు 80 క్యూసెక్కుల నీటిని విడిచి పెట్టారు. దీనిని గమనించిన రైతులు ఆందోళన చెందారు. నీటిని వృథాగా విడిచి పెడితే తాము పండిస్తున్న పంటలకు సాగునీరందని పరిస్థితి నెలకొంటుందని మహాలక్ష్మిపురం కాలనీ, భగీరథపురం, అంబావల్లి, రెల్లివలస, పిండ్రువాడ గ్రామాల రైతులు వాపోయారు. ఈ విషయమై జడ్పీటీసీ బుచ్చిబాబు వంశధార ఎస్ఈ డోల తీరుమలరావుతో ఫోన్‌లో మాట్లాడారు. ఒక రోజు మాత్రమే నీటిని విడిచి పెట్టాలని సిబ్బందికి ఆదేశించామన్నారు. తక్షణమే కిందకు నీటిని విడుదల నిలిపివేస్తామన్నారు. సిబ్బంది చేరుకొని గేటు మూసివేసి నదిలోకి నీటి విడుదలను నిలిపివేశారు.

పుస్తకాల వితరణ

పాతపట్నం: ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థుల కోసం తెంబూరు జడ్పీహైస్కూల్ జీవశాస్త్ర ఉపాధ్యాయుడు దండుగుల శ్రీనివాసరావు కాంపిటేటివ్ పుస్తకాలను మంగళవారం అందించారు. నీట్, ఎంసెట్ పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలను ప్రిన్సిపాల్ కేవీ రత్న కుమారికి అందించారు.

ఘనంగా వెంకన్నస్వామి కల్యాణం

ఒడిశా

పర్లాకిమిడి: శతాధిక చరిత్ర కలిగిన పర్లాకిమిడి వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం వార్షిక కల్యాణం ఘనంగా నిర్వహించారు. పైడిఘంటం వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో కల్యాణం చేపట్టారు. ఆలయ ప్రధాన అర్చకులు భద్రం శ్రీనివాసాచార్యుల ఆధ్వర్యంలో పూజలు చేశారు. పలువురు భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

పేదల పక్షపాతి సీఎం నవీన్


ఆర్థిక సాయం అందిస్తున్న దృశ్యం

పర్లాకిమిడి: పేదల పక్షపాతి సీఎం నవీన్ అని జిల్లా పరిషత్ అధ్యక్షుడు గవర తిరుపతి అన్నారు. స్థానిక ఆర్ఎంసీ కార్యాలయంలో ఆహార భద్రత సంక్షేమ పథకంలో భాగంగా మంగళవారం ప్రతీ కుటుంబానికి రూ.1000 జీవన సహాయం అందించే కార్యక్రమం ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా ఈ పథకాన్ని సీఎం నవీన్ వర్చువల్ విధానంలో ప్రారంభించారు. రాష్ట్రంలో నిరుపేద కుటుంబాలకు ఆహార భద్రత కింద ఈ పథకం ఉపయోగపడు తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రతి రంజన్ ప్రాన్, మున్సిపల్ చైర్మన్ నిర్మలశెట్టి, బీరేంద్రకుమార్‌దాస్, పౌరసరఫరాల అధికారి ప్రఫుల్‌కుమార్ పాల్గొన్నారు.

కుంటిభద్రలో ఒకరి ఆత్మహత్య

కొత్తూరు: మండలంలోని కుంటిభద్రలో సామిల్లులో పనిచేసే ఓ వ్యక్తి మంగళవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. సోంపేట మండలంలోని పాలవలస గ్రామానికిచెందిన తామాడా భోగిరాజు కుంటిభద్రలో సామిల్లులో దినసరి కూలీగా పనిచేస్తున్నాడు. భోగిరాజు ఆస్తమాతో బాధపడుతున్నాడు. ఆస్తమా నివారణకోసం పలుచోట్ల చికిత్సపొందినా ఫలితం లేకుండా పోయింది.ఈనేపథ్యంలో సామిల్లులోని గదిలోని దూలానికి ఉరివేసుకు న్నాడు. భోగిరాజు భార్య హేమావతి ఫిర్యాదుమేరకు కొత్తూరు ఇన్‌చార్జి ఎస్‌ఐ నారాయణస్వామి కేసు నమోదు చేశారు. ఆయనకు కుమార్తె, కుమారుడు ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పాతపట్నం ఆసుపత్రికి తరలించారు.

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి

టెక్కలి: నౌపడా ఆర్ఎస్ రైల్వేస్టేషన్ వద్ద మంగళవారం మధ్యాహ్నం విశాఖకు చెందిన చెంచుల భానుచంద్రరావు(35) రైలు ఎక్కుతూ జారిపడి మృతిచెందాడు. స్థానికులు, రైల్వే పోలీసుల కథనం మేరకు.. మూడురోజుల కిందట యామాలపేట వచ్చి తిరిగి విశాఖ వెళ్లేందుకు రైలెక్కుతూ ప్రమాదవశాత్తు జారిపడ్డాడని రైల్వే పోలీసులు తెలిపారు.గాయపడిన భానుచంద్రరావును ప్రభుత్వాసుపత్రికి తరలించినప్పటికే మృతిచెందాడన్నారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదుచేశారు.

డివైడర్‌ను ఢీకొట్టి ట్యాంకర్ బోల్తా

శ్రీకాకుళం క్రైం: మునసబుపేట సమీపంలో డివైడర్‌ను ఢీ కొట్టి ట్యాంకర్ బోల్తా పడింది. రూరల్ పోలీసుల కథనం మేరకు...ఒడిశాలోని పారాదీప్ నుంచి యాసిడ్ ట్యాంకర్ విశాఖవెళ్తోంది. సోమవారం అర్ధరాత్రి రెండు గంటల సమయంలో రూరల్‌మండలంలోని మునసబుపేట సమీపంలో డ్రైవర్‌నిద్రమత్తులో డివైడర్‌ను ఢీకొట్టాడు. దీంతో ట్యాంకర్ బోల్తా పడింది.విషయం తెలుసుకున్న పెద్దపాడు పోలీసుస్టేషన్ ఎస్‌ఐ గేదెల వాసుదేవరావు సంఘటన స్థలానికి వెళ్లి ప్రమాదానికి గల కారణాలను తెలుసుకు న్నారు.ప్రమాదంలో ప్రాణనష్టం జరగలేదని ఎస్‌ఐ తెలిపారు. డ్రైవర్‌కు గాయాలయ్యాయని చెప్పారు.ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

హిరమండలం: మండలంలోని గొట్టపొలమ్మ గుడి వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పాతపట్నం మండలం పెద్దలోగిడికి చెందిన ఉషారాణి తలకు గాయాలయ్యాయి. భర్త కృష్ణారావుతో కలిసి ద్విచక్రవాహనంపై భైదలాపురంలో శుభకార్యానికి వెళ్లి తిరిగి వస్తుండగా గొట్ట పోలమ్మ గుడి సమీపంలో స్పీడ్ బ్రేకర్ వద్ద జారి పడడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స నిర్వహించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ప్రైవేటు వాహనంలో రాగోలు జెమ్స్ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్‌ఐ నారాయణస్వామి తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఉపాధి పనుల్లో అవినీతిపై చర్యలు: పీడీ

పొందూరు:ఉపాధి పనుల్లో జరిగిన అవినీతిపై త్వరలో చర్యలు తీసుకుంటామని ఎన్‌ఆర్‌ఈజీఎస్ పీడీ బీవీ చిట్టిరాజు తెలిపారు. మండలంలో జరిగిన ఉపాధి పనులపై ఈనెల 5 నుంచి 18 వరకు జరిగిన సామాజిక తనిఖీలపై మంగళవారం పొందూరుఎంపీడీవో కార్యాలయంలో ప్రజావేదిక నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీఉషారాణి,జడ్పీటీసీ కాంతారావు,అంబుడ్స్ మెన్ సన్యాసిరాజు, సీనియర్ క్వాలిటీ కంట్రోల్ అధికారి వి. సతీష్‌బాబు, ఏపీడీ లోకేశ్వరరావు, పి. శ్రావణ్‌కుమార్, ఏపీవో శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మికుల నిర్బంధం

ఆమదాలవలస: పట్టణంలోని ఆచార్య ఎన్‌జీరంగా కృషి విజ్ఞాన కేంద్రంలో కాంట్రాక్ట్ కార్మికులుగా విధులు నిర్వహిస్తున్న వ్యవసాయ కార్మికులను పోలీసులు నిర్బంధించారు. సమస్యల పరిష్కారంకోసం బుధవారం గుంటూరు జిల్లాలోని ఎన్‌జీరంగా విశ్వవిద్యాలయం ముందు రాష్ట్ర సంఘం ఆధ్వర్యంలో ధర్నాకు పిలుపునిచ్చారు.ఆమదాలవలస నుంచి మంగళవారం కార్మిక సంఘం అధ్యక్షురాలు పి.త్రివేణి ఆధ్వర్యంలో 24 మంది కార్మికులు రైల్వేస్టేషన్‌కు చేరారు.వ్యవసాయ కార్మికులు వెళ్లకుండా స్థానిక పోలీసులు రైల్వేస్టేషన్ నుంచి బలవంతంగా పోలీస్‌స్టేషన్‌కు తరలిం చారు. అనంతరం విడుదల చేశారు.

లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయండి

ఇచ్ఛాపురం: స్థానిక కోర్టులో మార్చి తొమ్మిదో తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని ఇచ్ఛాపురం మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయాధికారి పి.పరకేష్‌కుమార్ కోరారు.ఇచ్ఛాపురంలోని కోర్టులో న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయవాదులు దేవరాజ్, జి.సీతయ్య, నాగరాజుపాత్రో, భగవాన్‌దాస్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

సమాన న్యాయం అందించడమే లక్ష్యం

టెక్కలి: సమాజంలో కుల, మత, లింగ, వర్ణ వివక్ష లేకుండా సమాన న్యాయం అందించడమే న్యాయస్థానాల లక్ష్యమని కోటబొమ్మాళి జూనియర్ సివిల్ న్యాయాధికారి బీఎంఆర్ ప్రసన్నలత అన్నారు. మంగళవారం సామాజిక న్యాయ దినోత్సవం సందర్భంగా కోటబొమ్మాళి కోర్టు ఆవరణలో న్యాయ వాదులు, పోలీసులు, కక్షిదారులతో ప్రత్యేక న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు.

బూరవెల్లిలో శివపార్వతుల కల్యాణం

గార:మండలంలోని బూరవెల్లిలో ఉమారామలింగేశ్వర స్వామివార్షిక కల్యాణ మహోత్సవం భీష్మఏకాదశి పురస్కరించుకుని మళ్ల జనార్దనరావు, శ్రీదేవి దంపతులు, మళ్లమణికంఠ, అనురాధ దంప తుల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు.గ్రామపురోహితులు ఆరవెల్లి సీతారామస్వామి,అనంతరామన్‌తో పాటు పలువురు బుత్విక్కులు కల్యాణం సంప్రదాయ పద్ధతిలో జరిపారు.

పురుషోత్తపురంలో రంగనాథస్వామి..

సరుబుజ్జిలి:పురుషోత్తపురంలో రంగనాథస్వా మివారి తిరుక్కల్యాణ మహోత్సవాలు మంగళవారం నిర్వహించారు. శ్రీనివాసారామానుజస్వామి ఆలయ అర్చకులు సనపల యతిరాజుదాసు ఆధ్వర్యంలో స్వామివారికి సుప్రభాత, విశ్వక్షేన కల్యాణమండపం పూజలుచేశారు.అనంతరం స్వామివారి తిరువీధి చేశారు.

వైభవంగా సూర్యనారాయణ స్వామి..

అరసవల్లి:అరసవల్లిసూర్యనారాయణ స్వామివారి కల్యాణం మంగళవారం వైభవంగా జరిగింది. భీష్మ ఏకాదశి పురస్కరించుకుని అనివెట్టి మండపంలో ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో వేదపండితులు వేద మంత్రా లు, మంగళ వాయిద్యాల నడుమ స్వామివారి కల్యాణం నిర్వహించినట్లు ఈవో డీఎల్‌వీ రమేష్‌బాబు తెలిపారు.

మహా మృత్యుంజయ ఆలయాల ప్రారంభం


కలశాలతో మహిళలు

కవిటి: మండలంలోని ముత్యాలపేటలో నిర్మించిన మహా మృత్యుంజయ ఆలయాల సమూహాలను మంగళవారం ప్రారంభించారు. మూడురోజుల పాటు నిర్వహించిన ప్రతిష్ఠోత్సవంలో భాగంగా వేదపండితుల మంత్రోచ్ఛరణతో పూజలు చేశారు. స్వామి వారి కల్యాణమూ ర్తులను హరినామ సంకీర్తనలతో గ్రామ ప్రదక్షిణ చేశారు.

సత్తాచాటిన ట్రిపుల్ ఐటీ విద్యార్థులు

ఎచ్చెర్ల: ఎచ్చెర్లలోని ట్రిపుల్ ఐటీ విద్యార్థులు రాజాంలోని జీఎంఆర్ ఐటీలో నిర్వహించిన వెబ్‌ఓ స్టవ్ టెక్నికల్ ఫెస్టివల్‌లో విద్యార్థులు సత్తాచాటారు. ఈమేరకు ఎలక్ట్రికల్‌మేనేజ్‌మెంట్ సిస్టమ్ టైటిల్‌లో ఇంజినీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్న సాయి సంతోష్, ప్రేమ్‌చంద్, తరుణ్, కిరణ్ విజేతగా నిలిచి రూ.10వేలుబహుమతిని సాధించారు. బేసిక్ విభాగంలో హాస్టల్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ఆవిష్కరణలో కూడా ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు రెండో బహుమతిని సాధించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ కేవీడీజీ బాలాజీ, ఏవో ముని రామకృష్ణ, డీన్ మోహనకృష్ణ చౌదరి అభినందించారు.

విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలి: ఎంఈవో

సరుబుజ్జిలి:పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపడేందుకు అధ్యాపకులు కృషిచేయాలని ఎంఈవో డి.బాలరాజు తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు నిర్వహించారు.సమావేశంలో స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ బొత్స వెంకటరమణ పాల్గొన్నారు.


రణస్థలం: టీడీపీలోకి తిరుపతిపాలెం గ్రామస్థులను ఆహ్వానిస్తున్న కళా వెంకటరావు


ఎల్ఎన్‌పేట:మాట్లాడుతున్న వెంకటరమణమూర్తి


అరసవల్లి:బాబు ష్యూరిటీ కార్యక్రమం నిర్వహిస్తున్న గుండ లక్ష్మీదేవి

'సూపర్‌సిక్స్'తోనే ప్రజాసంక్షేమం

● జిల్లా వ్యాప్తంగా బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో టీడీపీ నాయకుల ప్రచారం


కంచిలి: బాబు ష్యూరిటీ కరపత్రం అందజేస్తున్న నాయకులు

టీడీపీ అధినేత ప్రవేశపెట్టిన మేనిఫెస్టోలోని సూపర్‌సిక్స్ పథకాలతో ప్రజా సంక్షేమం సాధ్యమని ఆ పార్టీ నాయకులు తెలిపారు. మంగళవారం జిల్లాలో బాబూ ష్యూరిటీ భవిష్యత్‌కు గారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలు అందజేశారు. అలాగే పలుచోట్ల వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు.

చంద్రబాబుతోనే అభివృద్ధి: లక్ష్మీదేవి

అరసవల్లి: టీడీపీ-జనసేన కూటమిని గెలిపించి చంద్రబాబును మళ్లీ ముఖ్యమంత్రిని చేయడం ద్వారా మాత్రమే రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సాధ్యమని, ప్రజలంతా అందుకు సహకరించాలని మాజీ ఎమ్మెల్యే, శ్రీకాకుళం నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి గుండ లక్ష్మీదేవి కోరారు. శ్రీకాకుళం కార్పొరేషన్‌లోని 44వ డివిజన్‌లో ఇన్‌చార్జి కవ్వాడి సుశీల ఆధ్వర్యంలో బాబుష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీకార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను వివరిస్తూ హామీపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో శ్రీకాకుళం నగర టీడీపీ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, ప్రధాన కార్యదర్శి చిట్టి నాగభూషణం, జామి భీమశంకరరావు, రవి, మహేష్, హరీష్ పాల్గొన్నారు.

వైసీపీ నాయకులు టీడీపీలో చేరిక

నగరపాలక సంస్థ పరిధిలోని వైసీపీ నాయకులు కిల్లంశెట్టి రమేష్, జామి రాధాకృష్ణ, జామి మాణిక్యేశ్వరరావు, బరాటం ఈశ్వరరావు తదితరులు టీడీపీ రాష్ట్రవాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి కోరాడ హరగోపాల్ ఆధ్వర్యంలో మాజీమంత్రి గుండ అప్పలసూర్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి సమక్షంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో జామి భీమశంకరరావు, చిట్టి నాగభూషణరావు, అంధవరపు రఘు, చంద్రశేఖర్, కర్రి మోహనరావు పాల్గొన్నారు.

వైసీపీతో ప్రజలు విసిగిపోయారు: శంకర్

వైసీపీ పాలనతో ప్రజలు విసిగిపోయి ఉన్నారని, చంద్రబాబు నాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నారని టీడీపీ నాయకుడు, ఉమ్మడి జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గొండు శంకర్ తెలిపారు. శ్రీకాకుళం మండలంలోని హయత్‌నగర్ ప్రాంతానికి చెందిన యలమంచిలి హరికృష్ణ, యలమంచిలి పవన్‌కుమార్, కోర్టన రాము, అలబాన చిన్నారావు, అలబాన జయ, దువ్వ రమణ తదితర 50 కుటుంబాలు టీడీపీలో చేరాయి. వారికి టీడీపీ కండువాలు వేసి శంకర్ పార్టీలోకి ఆహ్వానించారు.కార్యక్రమంలో ఏఎంసీ మాజీ డైరెక్టర్ బొల్ల నాగేంద్రయాదవ్, టీఎన్ఎస్ఎఫ్ నియోజకవర్గ అధ్యక్షుడు రెడ్డి శంకర్, మాజీ సర్పంచ్ ఎండు చిన్నారావు, సానివాడ సర్పంచ్ రుప్ప రమణమూర్తి, పాత్రునివలస సర్పంచ్ పంచిరెడ్డి అప్పలనాయుడు, రవి, తెలుగు యువత కార్యదర్శి గొండు శ్యామ్‌సుందర్, రాయి కిరణ్, పొన్నాడ ప్రసాద్ పాల్గొన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి: కళా

రణస్థలం: కార్యకర్తలు కార్యకర్త సైనికుల్లా పనిచేయాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కిమిడికళావెంకటరావు పిలుపునిచ్చారు. మండలంలోని తిరుపతిపాలెం గ్రామానికి చెందిన 30 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. వారికీ కళావెంకటరావు టీడీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కళా వెంకటరావు మాట్లాడుతూ చాలామంది వైసీపీని వీడి టీడీపీలోకి చేరేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. తిరుపతిపాలెం మాజీ సర్పంచ్ ఆకుల రామినాయుడు మాట్లాడుతూ వైసీపీ పాలనలో ఎటువంటి అభివృద్ధిలేదని, తమ గ్రామం టీడీపీ హయాంలో అన్ని విధాలుగా అభివృద్ధి చెందిందన్నారు. మీసాల రమణ, ఆకుల చిన్న, ఆకుల అసిరినాయుడు, కంది రమణ, ఆకుల సీతంనాయుడు, దుప్పాడ పరమేశ్వరరావు, దుప్పాడ సూరప్పడు, దుప్పాడ కుమార్,దుప్పాడ సూర్యనారాయణ,దుప్పాడ తవిటయ్య, దుప్పా డకృష్ణ, మండలసూర్యనారాయణ, ఆకుల రమణారావు, ఆకుల సూర్యనా రాయణ, ముక్క రాము, పచ్చిపాలు పోతయ్య, మండల సూర్యనారా యణతో పాటు మరి కొన్ని కుటుంబాలు టీడీపీలో చేరాయి. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్రప్రధాన కార్యదర్శి కిమిడి రామ్‌కల్లిక్‌నాయుడు, టీడీపీ మండలాధ్యక్షుడు లంక శ్యామలరావు, డీజీఎం ఆనందరావు, పిన్నింట భాను, పిషిని జగన్నాథంనాయుడు, కనకారావు, మైలపల్లి పోలీస్, మజ్జి రమేష్, కెళ్ల హేమంతుకుమార్ పాల్గొన్నారు.


గార: కె.మత్స్యలేశంలో భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు


జి.సిగడాం: టీడీపీ సూపర్‌సిక్స్ మేనిఫెస్టోను వివరిస్తున్న రామ్‌మల్లిక్‌నాయుడు

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి: కలమట

ఎల్.ఎన్.పేట/హిరమండలం/మెళియాపుట్టి: త్వరలో జరగనున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు వివరించాలని మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణమూర్తి అన్నారు. మంగళవారం ఎల్ఎన్‌పేట మండలం శ్యామలాపురం, హిరమండలం, మెళియాపుట్టిల్లో టీడీపీ క్లస్టర్, యూనిట్ ఇన్‌చార్జిలతో సమావేశాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ఆ పార్టీ నాయకులుఎం.మనోహర్ నాయుడు, కె.చిరంజీవి, వి.ఆనందరావు, ఎస్.కిషోర్ బాబు, బూర్లె లలితకుమారి, భాస్కర్‌గౌడో, పర మేష్‌రెడ్డి, వసంత్, చెట్టు శ్రీనివాసరావు, దారపు ఢిల్లేశ్వరరావు, బర్రి సురేష్, గోళ్ల సింహాచలం, గవర చిట్టిబాబు పాల్గొన్నారు.

రాక్షస పాలనను తరిమికొట్టండి: రామ్‌మల్లిక్

జి.సిగడాం: రాష్ట్రంలో రాక్షస పాలనను తరిమి కొట్టాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్ నాయుడు పిలుపునిచ్చారు. మంగళవారం జాడ, జగన్నాథవలస, ముక్కుపేటలో టీడీపీ సూపర్ సిక్స్ పథకాల ప్రచార ం నిర్వహించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కుమరాపు రవికుమార్, సర్పంచ్ గోక మహేష్, కోన వెంకటరావు, పంచిరెడ్డి బంగారినాయుడు పాల్గొన్నారు.

● **గార:** మండలంలోని కె.మత్స్యలేశంలోభవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. టీడీపీ నాయకుడు జేసీ దేవదాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉప సర్పంచ్ బి.లక్ష్మి నాయకులు పాల్గొన్నారు.

●**కంచిలి:**కుమ్మరినోగాం పంచాయతీలో బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమాన్ని టీడీపీ నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి 130 కుంటుంబాలతో రిజిస్ట్రేషన్ చేయించారు.


నరసన్నపేట: అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న నరసన్నపేట ప్రెస్‌క్లబ్ సభ్యులు


ఆమదాలవలస: తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు


అరసవల్లి: మాట్లాడుతున్న గొండు శంకర్


ఇచ్ఛాపురం: మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

తక్షణమే నిందితులను అరెస్టు చేయాలి

● ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్‌పై దాడికి నిరసనలు

అనంతపురం జిల్లా రాప్తాడులో ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ నాయకులు దాడిచేయడాన్ని ఖండిస్తూ జిల్లావ్యాప్తంగా మంగళవారం జర్నలిస్టులు, పలు సంఘాల, టీడీపీ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జర్నలిస్టులు ర్యాలీలు నిర్వహించి అనంతరం అధికారులకు వినతిపత్రాలు అందజేశారు. తక్షణమే నిందితులను అరెస్టు చేయాలని జర్నలిస్టులు డిమాండ్‌చేశారు.

దాడి అమానుషం : కళా

రణస్థలం: విధినిర్వహణలో ఉన్న రాప్తాడు ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకదాడి చేసి తీవ్రంగా గాయపరచడం అమానుషమని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కిమిడి కళావెంకటరావు, టీడీపీ రాష్ట్రప్రధాన కార్యదర్శి కిమిడి రామ్‌మల్లిక్‌నాయుడు మండిపడ్డారు.కమ్మసిగడాం మహాలక్ష్మీతల్లిని దర్శించుకున్నారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలపై ప్రశ్నించే వ్యక్తులపై దాడులు చేయడం వైసీపీ మూకలకు అలవాటు అయ్యిందని, ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా పనిచేసే విలేకరులపై దాడికి పాల్పడిన వ్యక్తులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. టీడీపీ హయాంలో తోటపల్లి కాలువ ద్వారా నీరుతెచ్చి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేశామన్నారు. వైసీపీ పాలనలో చుక్క నీరు ఇవ్వలేక పోయారని విమర్శించారు.

దాడిని ప్రతిఒక్కరూ ఖండించాలి: జల్లు

గార: ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై వైసీపీ మూకల దాడి శోచనీయమని, ఈ సంఘటనను ప్రతిఒక్కరూ ఖండించాలని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి జల్లు రాజీవ్ ఒక ప్రకటనలో పేర్కొ న్నారు. పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగించే ఇటువంటి చర్యలు భవిష్య త్‌లో జరగకుండా చూడాలని కోరారు.

ప్రజాస్వామ్యానికే మాయని మచ్చ: జయదేవ్

ఇచ్ఛాపురం:రాప్తాడులో ఆంధ్రజ్యోతి విలేకరిపై దాడి ప్రజాస్వామ్యానికే మాయని మచ్చ అని నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు కాళ్ల జయదేవ్ తెలిపారు. మంగళవారం ఇచ్ఛాపురంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజాస్వామ్యానికి నాలుగో స్తంభమైన మీడియాకు గౌరవం ఇవ్వకుండా కక్షపూరితంగా కొన్ని పత్రికలపై ప్రత్యేకించి దృష్టి పెట్టి దాడులు చేయటం దుర్మార్గపు చర్య అని అన్నారు. కార్యక్రమంలో తెలుగు ప్రొఫెషనల్స్ వింగ్ పార్లమెంట్ అధ్యక్షుడు ఊనా సంతోష్‌కుమార్, పట్టణ ఐటీడీపీ అధ్యక్షుడు సాలిన జగదీష్‌యాదవ్, టీపీడబ్ల్యూ నియోజకవర్గ కీలక సభ్యులు పైల నారాయణ, జయదేవ్ యాదవ్ పాల్గొన్నారు.

అభద్రతా భావంతోనే దాడి: గొండు శంకర్

అరసవల్లి:ముఖ్యమంత్రిజగన్‌రెడ్డి సభకు మద్యం,డబ్బు వెదజల్లినా ప్రజలు రాలేదని, వచ్చిన వారు కూడా మధ్యలోనే వెళ్లిపోతున్నారని, ఈ విషయం ఎక్కడ బయటపడుతుందోనని అభద్రతా భావంతోనే ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ కృష్ణపై వైసీపీ రైడీ మూకలు దాడికి పాల్పడ్డాయని టీడీపీ నాయకుడు, ఉమ్మడి జిల్లా సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు గొండు శంకర్ విమర్శించారు.మంగళవారం శ్రీకాకుళంలో ఆయన విలేకరులతో మాట్లాడుత వైసీపీకి రోజులు దగ్గర పడుతున్నందు వల్లనే అసహనంతో ఇటువంటి పనులకు పాల్పడుతు న్నారని తెలిపారు. తక్షణమే నిందితులను అదుపులోకి తీసుకుని కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బొల్లా నాగేంద్ర యాదవ్, ఎండు చిన్నారావు, రాయి కిరణ్, పొన్నాడ కిషోర్, ప్రసాద్, మైలపిల్లి నరిసింహమూర్తి, రవి పాల్గొన్నారు.

● **నరసన్నపేట:** అనంతరపురం జిల్లా రాప్తాడులో వైసీపీ నిర్వహించిన సిద్ధం సభలో ఆ పార్టీ మూకలు ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై దాడి చేయడం అమానుషమని, దాడికి పాల్పడిన వారిని వెంటనే శిక్షించాలని ఏపీయూడబ్ల్యూజే నరసన్నపేట ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు టీవీ చంద్రమోహన్‌దేవ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం అంబేడ్కర్ విగ్రహం వద్ద జర్నలిస్టులు ధర్నా చేపట్టారు. అక్కడి నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టి తహసీల్దార్ కనకారావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నరసన్నపేట ప్రెస్‌క్లబ్ సభ్యులు బి.జయవర్ధన్, తాతాజీ, కిరణ్, గణేష్, నెయ్యల నారాయణరావు, బి.నారాయణరావు, గోపాల కృష్ణ, బుజ్జి, డానియల్, సంతోష్ , కేశవరాజు, రామ్మోహనరావు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి

ఆమదాలవలస: ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్ శ్రీకృష్ణపై కొంత మంది రౌడీమూకలు కర్రలు, చేతులతో దాడి చేయడం తగదని ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు పేడాడ పూర్ణారావు పేర్కొన్నారు.మంగళవారం ఆమదాలవలస పన్‌వే జంక్షన్ వద్ద ఉన్న గాంధీ విగ్రహానికి విలేకురులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు.కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ కార్యదర్శి దుప్పల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు సనపల శ్రీనివాసరావు,విలేకరులు అన్నంనాయుడు, జగ్గునాయుడు, సనపల చం ద్రశేఖర్, మోహన్‌రావు, పాత్రుని రామ్మోహన్‌రావు, రమేష్, దుర్గారావు పాలొన్నారు.

టీడీపీతోనే గ్రామాల అభివృద్ధి: ఎమ్మెల్యే


సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న అశోక్

ఇచ్ఛాపురం: టీడీపీతోనే గ్రామాలు అభివృద్ధి జరుగుతున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ బెందాళం అశోక్ తెలిపారు. మంగళవారం అరకపద్రలో ఎంపీ నిధులు రూ.ఐదు లక్షలతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దక్కత ఢిల్లీరావు, ఎస్.సహదేవు రెడ్డి, సర్పంచ్ రంగాల పద్మావతి, నాయకులు ధర్మరావు, డి.కామేశ్వరరావు, పి.బాబ్జీ, ఎం.సూర్యనారాయణ, ఎల్.పద్మనాభం, కె.శంకర్, ప్రకాష్ చంద్ర నాయక్, మేరుగు.నారాయణ, డి.రామారావు, ఈ.గిరి. గిన్ని బాలరాజు, రంగాల పుణ్యవాసులు, ఎం.బాబురావు పాల్గొన్నారు.

ఆకు ఎండు తెగులుపై అప్రమత్తంగా ఉండాలి

రణస్థలం: మొక్క జొన్నపంటకు ఆశించే ఆకు ఎండు తెగులుపై రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయశాస్త్రవేత్త కె.భాగ్యలక్ష్మి కోరారు. మంగళవారం లంకపేట రైతులు సాగు చేసిన మొక్క జొన్న పంటనుపరిశీలించారు. కార్యక్రమంలో ఎస్.అనుష, వై .సూర్యనారాయణ, ఏడీ శ్రీనివాసరావు, ఏవో డి.విజయభాస్కరరావు పాల్గొన్నారు.

కొమ్ముపుట్టుగ రోడ్డుకు మరమ్మతులు

కవిటి: మండలంలోని కొమ్ముపుట్టుగకు వెళ్లే రోడ్డుకు నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి దాసరి రాజు సొంత నిధులతో అభివృద్ధిచేశారు.ఈ మేరకు మంగళవారం కంకరవేసి మరమ్మతులు చేయించారు. ఇక్కడ రోడ్డు పూర్తిగా పాడైనా పాలకులు పట్టించుకోకపోవడంతో తాను సొంత ఖర్చులతో మరమ్మతుచేస్తానని గ్రామస్థులకు హామీ ఇచ్చారు. ఈమేరకు కంకర లోడ్లు వేసి రోడ్డును అభివృద్ధిచేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు మధు, శ్యామ్, ధనుంజయం, వైకుంఠరావు పాల్గొన్నారు.

'పెంకాక్ సిలట్'లో క్రీడాకారుల సత్తా

శ్రీకాకుళం స్పోర్ట్స్: జిల్లా క్రీడాకారులు మహారాష్ట్రలోని నాందేడ్‌లో ఈ నెల 18 నుంచి జరుగుతున్న ఆల్‌ఇండియా పెంకాక్ సిలట్ పోటీల్లో సత్తాచాటారు. ఏపీతరపున ప్రాతినిధ్యం వహించిన జిల్లా క్రీడాకా రులు మూడు రజిత, రెండుకాంస్య పతకాలుసాధించారు. జూనియర్ విభాగంలో ఎం.పవన్‌సాయి, సబ్ జూనియర్ విభాగంలో పిల్ల నికేష్‌నా యుడు, పొన్నాడ శ్రీకేర్ రజితాలు కైవశం చేసుకోగా, లలిత్ మిదిన్, చెరిష్మాలు కాంస్య పతకాలు సాధించారు. క్రీడాకారులను జిల్లా పెంకాక్ సిలట్ అధ్యక్షుడు గ్రాండ్‌మాస్టర్ రేగిడి దయామయ, జిల్లా ప్రధాన కార్యదర్శి, శిక్షకులు నక్క లక్ష్మణ్ నాయుడు, లింగాల ఈశ్వర్‌రావు అభినందించారు.

నోటీసులతో సెక్రటేరియట్ ముట్టడిని ఆపలేరు

పొందూరు:నోటీసులతో సెక్రటేరియట్ ముట్టడిని ఆపలేరని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి పైడినాగభూషణరావు తెలిపారు. మంగళవారం కింతలిలో నాగభూషణరావు సెక్రటేరియట్ ముట్టడికి వెళ్లకుండా పోలీసులు నోటీసులు అందించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడు తూ సమస్యలపై పోరాటానికి కాంగ్రెస్ సెక్రటేరియట్ ముట్టడి నిర్వహిస్తే వైసీపీప్రభుత్వం నోటీసులతో భయపెట్టాలని చూస్తోందని ఆరోపించారు.

'షాదీ తోఫా, కల్యాణమస్తు'తో 340 మందికి లబ్ధి.

కలెక్టరేట్: జిల్లాలో వైఎస్సార్ షాదీ తోఫా, కళ్యాణమస్తు పథకాల ద్వారా 340 మందికి రూ.2.13 కోట్ల లబ్ధి చేకూరినట్లు కలెక్టర్ కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్ లబ్ధిదారులకు నమూనా చెక్కును అందజేశారు.

జగన్‌కు ఓటేయమని చెప్పండి: స్పీకర్

పొందూరు: వలంటీర్లే రాష్ట్రంలో వైసీపీ విజయానికి సారథులని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారం స్పష్టం చేశారు. పొందూరులో వలంటీర్లకు వందనం కార్యక్రమంలో మాట్లాడారు. సంక్షేమపథకాలు అందిస్తున్న వైసీపీ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డికి ఓటువేయాలని ఇంటింటికి వెళ్లి ప్రచారం చేయాలని సూచించారు. వలంటీర్లు ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదన్నారు.

బీఎస్సీ పారామెడికల్ కోర్సుల్లో ఉచిత అడ్మిషన్లు

అరసవల్లి: బొల్లినేని మెడిస్కిల్స్(జెమ్స్)లో బీఎస్సీ పారా మెడికల్ కోర్సుల్లో ఉచితంగా అడ్మిషన్లు కల్పిస్తున్నామని ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో తమ కళాశాలలో మాత్రమే ఈ కోర్సులు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. బీఎస్సీ ట్రాన్సిషన్ టెక్నాలజీ, రేడియోథెరపీ టెక్నాలజీ, ఫిజీషియన్ అసిస్టెంట్ టెక్నాలజీ, కార్డియాక్ కేర్, పెర్ఫ్యూషన్, రేడియాలజీ, ఆప్టోమెట్రీ, న్యూరోఫిజియాలజీ, డయాలసిస్, రెస్పిరేటరీ, మెడికల్ రికార్డ్సుటెక్నాలజీ తదితరకోర్సుల్లో సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.ఈకోర్సుల్లో చేరేందుకు ఇంటర్ బైపీసీ పూర్తి చేసినవారు అర్హులని పేర్కొన్నారు. వివరాలకు 7995013422, 9121999654 నెంబర్లను లేదారాగోలులోని జెమ్స్ క్యాంపస్‌లో సంప్రదించాలని కోరారు.

సూక్ష్మపోషకాలతో అధిక దిగుబడి

కంచిలి: కొబ్బరిలో అధికదిగుబడులు సాధించేందుకు రైతులు సూక్ష్మ పోషకాలను వినియోగించాలనిపెద్దపేటఉద్యాన పరిశోధనాకేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ బీవీకే భగవాన్ సూచించారు. మఖారాంపురం, కొజ్జిరియాలో కొబ్బరి అభివృద్ధిసంస్థ ద్వారా ఆర్‌అండ్‌ఆర్ పథకంలో భాగంగాఏర్పాటుచేసిన కొబ్బరిక్షేత్రాలను కొబ్బరి అభివృద్ధి సంస్థ సభ్యులు సందర్శించారు.కార్యక్రమంలో సీడీబీడైరెక్టర్ ఆర్వాలి,సీడీబీడీడీ ఎస్.కుమరవేల్, డిప్యూటీడీడీ హార్టి కల్చర్ సుజాత, జిల్లా ఉద్యాన అధికారి ఆర్‌వీవీ ప్రసాద్, సభ్యులు కిరణ్, చికాఫ్ చైర్మన్ జోహర్‌ఖాన్,ఉద్యాన అధికారి పి.మధులత,ఉద్యానవన విస్తరణ అధికారి టి.బాలరాజు పాల్గొన్నారు.

టైలరింగ్, బ్యూటీపార్లర్‌లో శిక్షణ

ఎచ్చెర్ల: ఎచ్చెర్లలోని యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణసంస్థ ఆధ్వర్యంలో మహిళలకు టైలరింగ్,బ్యూటీపార్లర్ నిర్వహణలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు శిక్షణసంస్థ డైరెక్టర్ కల్లూరి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. 30 రోజుల పాటు తరగతులు నిర్వహించే శిక్షణ వచ్చేనెల మూడో తేదీ నుంచి ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఆసక్తి గల మహిళలు ఫోన్ నెంబర్లు 95534 10809, 79933 40407కు సంప్రదించాలని కోరారు.